శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# సీఎం ఢిల్లీ పర్యటనలో ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. టీడీపీ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రులను కలసిన సీఎం చంద్రబాబు ఈ మేరకు రాష్ట్రానికి వివిధ అంశాలపై ఆయన కేంద్ర మంత్రులకు వివరించారు. ఈ పర్యటనలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌ను కలిశారు. పలు అంశాలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. పర్యటనలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు మంజూరు



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్‌హాలులో జిల్లా పరిశ్రమలు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం మొద్కలెన అంశాలను జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు సంబంధించి అన్ని అనుమతులను ఆయాశాఖల అధికారులు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా సత్వరమే మంజూరు చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దిష్ట గడువు కంటే ముందుగా అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ, మౌలిక వసతుల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రింటింగ్, రెడిమేడ్ క్లస్టర్ డెవలప్ ప్రోగ్రాంపై దృష్టిసారించాలన్నారు. ప్రభుత్వం క్లస్టర్ డెవలప్‌మెంటుకు కోట్లాది రూపాయలు కేటాయించిందని, క్లస్టర్లు మంజూరైన నిర్వాహకులు కూడా ప్రత్యేక శ్రద్ధతో ముందుకొచ్చి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పలు పరిశ్రమలకు సబ్సిడీ ప్రోత్సాహాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని జిఎం, లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ మహబూబ్ బాషా ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ వెంకటరమణ, డ్వామా పీడీ గంగాభవాని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, కమిటీ సభ్యులు ఎపికె రెడ్డి, ఒమ్మిన్ సతీష్ కుమార్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జి ని మర్యాద పూర్వకంగా కలిసిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ జిల్లా జడ్జి శ్రీనివాస్ ను వారి కార్యాలయమునకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

## ఇన్‌ఛార్జ్ కమిషనర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్‌గా ఉన్న వై.ఓ. నందన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు కమిషనర్‌గా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్. సురేష్ కుమార్ మంగళవారంఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ తదుపరి చర్యలను తీసుకోవాలని సూచించారు.

## ఈ.ఎస్.ఐ ఆసుపత్రుల వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి ఇన్‌ఛార్జ్ కమిషనర్ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, ఏప్రిల్ 22 ,ప్రభాతవార్త:** కార్మికులకోసం ఈ.ఎస్.ఐ పథకం ఒక హెల్త్ ఇన్సూరెన్సు వంటిదని, వాటి ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ వై.ఓ నందన్ తెలియజేశారు. ఈ.ఎస్.ఐ పథకం సేవలను పొందేందుకు అవసరమైన విధానాలపై అవగాహన సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ కమిషనర్ నందన్ మాట్లాడుతూ ఈ.ఎస్.ఐ ద్వారా కవర్ చేయబడిన కార్మికులకు, వారి కుటుంబాలకు నిర్దేశించిన ఆసుపత్రుల ద్వారా సమగ్ర వైద్య సంరక్షణను అందిస్తాయని తెలిపారు. ఈఎస్ఐ తన ఆసుపత్రులు, డిస్పెన్సరీల నెట్‌వర్క్ ద్వారా, అలాగే ప్రైవేట్ ఆసుపత్రులతో భాగస్వామ్యం ద్వారా ఈ సంరక్షణను అందిస్తుందని, ఈ పథకం లబ్ధిదారుల ఖర్చుపై పరిమితులు లేకుండా అవసరమైన చికిత్సను పొందేలా చూడటం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. నెల్లూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న రెగ్యులర్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు అత్యవసర వైద్య సదుపాయాల కోసం మెడికవర్ ఆసుపత్రి లేదా ఒక పొగతోటలోని అనసూయ ఆసుపత్రులలో సేవలను పొంది, వైద్య బిల్లులను ఈఎస్ఐ ఆసుపత్రికి అందజేసి రియంబర్స్మెంట్ పొందగలరని తెలిపారు. సాధారణ అనారోగ్యాలకు ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించాలని, వైద్యుల సిఫార్సు మేరకు తిరుపతిలో వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఈఎస్ఐ ఆఫీస్ మేనేజర్ శివాజీ, వైద్యులు వెంకటేశ్వర్లు, నరేంద్ర, నగరపాలక సంస్థ అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ సిసి లో ఉత్తమ కాడేట్ అవార్డుని అందుకున్న రావూస్ విద్యార్థి



**నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త విద్య** నగరంలోని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో బీబీఏ చదువుతున్న విద్యార్థిని సిహెచ్. నవీనకు గుంటూరు గ్రూప్ లెవల్ లో ఉత్తమ ఎన్సిసి కాడేట్ అవార్డుని అందుకున్నారు. గుంటూరు కామాండింగ్ అధికారి కల్నల్ చంద్రశేఖర్, లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ లు నవీనకు రు 3000 నగదుతో పాటు జ్ఞాపికని అందించి సత్కరించారు. ఈ సందర్భగా రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై. కోటేశ్వరరావు, డైరెక్టర్ వై. శివ సాకేత్‌లు తమ విద్యార్థులు చదువుతోపాటు అన్నీ రంగాల్లో రాణించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం లో విద్యాసంస్థల సిఈఓ ఎన్. శివారెడ్డి, గుప్తా,పెంచల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఏప్రిల్22, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 51.534 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 50, ఎన్ఎఫ్‌సికి200, పెన్నా డెల్టాకు 1000 , కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 96.585మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సంపూర్ణ అక్షరాస్యత దిశగా.. కోవూరు

**- సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో నేతలు భాగస్వామ్యం కావాలి**





**కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : సంపూర్ణ** అక్షరాస్యత కారణంగా సమాజంలో మార్పు తప్పక వస్తుందని, ఈ దిశగా ఈ ఉద్యమంలో స్థానిక నాయకులు, భాగస్వాములు కావాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమావేశం మందిరంలో జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ మొబిలైజర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాన్ని చదువుతున్న ప్రతి ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా తీసుకుని ఈ సంపూర్ణ అక్షరాస్యత ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే చదువే ప్రధాన ఆయుధమన్నారు. అక్షరాస్యత అనేది అభివృద్ధికి సూచిక లాంటిదన్నారు. కోవూరు నియోజకవర్గంలో 22000 మంది నిరక్షరాస్యులు ఉన్నారనే విషయం తనను ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. వంద రోజుల పాటు నిర్వహించే ఈ వయోజన విద్య బోధన కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా 200 మంది కమ్యూనిటీ మొబిలైజర్లు, 2500 మంది ఉపాధ్యాయులు భాగస్వాములు అవుతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని స్థానిక ప్రజాప్రతినిధులు , నాయకులు తమవంతుగా చొరవ తీసుకుని నిరక్షరాస్యులైన వయోజనులకు విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకుంటేనే సామాజిక విషయాలపై అవగాహన పెరిగి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గంలో పొదుపు ఉద్యమం ఎంతో బలంగా ఉందని, ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు అన్నట్లు ప్రతి మహిళ ఈ అక్షరాస్యత కార్యక్రమానికి కొంత సమయం కేటాయించాలని కోరారు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా తలపెట్టిన ఈ వయోజన విద్య కేంద్రాలకు సంబంధించి ఏ అవసరం వచ్చినా సహాయం చేసేందుకు వీపీఆర్ ఫౌండేషన్ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందన్నారు. కోవూరు నియోజకవర్గం ఎంతో చైతన్యమైందని, గతంలో చేపట్టిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా జరిగాయన్నారు. నియోజకవర్గంలోని 82 పంచాయతీల్లోని గ్రామాల అభివృద్ధికి స్థానిక నాయకులు గుర్తించి ముందుకు సాగాలన్నారు. మనకు తెలిసిన విద్యను ఇతరులకు పంచడంలో ఆనందం ఉంటుందన్నారు. ప్రజలు మేలు కోరే ప్రతి కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తాను ఎల్లవేళలా ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ అజాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జెడ్పీ సీఈవో విద్యారమ, డీఈవో బాలాజీరావు, డ్వామా పీడీ గంగా భవాని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, ఐదు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఎంఈవోలు, తదితరులు ఉన్నారు.

# బొంతవారిపాలెంలో తాగునీటికి కటకట

**⌘ ఎమ్మెల్యేకి చెప్పినా ఒక్క రోజే సరఫరా**







**వలేటివారిపాలెం ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండలంలోని బొంతవారిపాలెంకు గత నెలరోజులుగా రక్షితనీరు అందడం లేదు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ అసమర్థత, కాంట్రాక్టర్ల, ఉన్నతాధికారులు అశ్రద్ధ, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం తదితర కారణాల వలన ప్రజలు తాగునీటికి నానా తంటాలు పడుతున్నారు. చుండి- చెర్లోపాలెం రక్షిత పథకం పనిచేయనందున తమ గ్రామానికి నీరు రావడం లేదని గ్రామస్తులు లబోదిబో అంటున్నారు. దీంతో రక్షితనీటికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి పలువురు గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆయన చొరవతో ఒక్క రోజు మాత్రమే నీటి సరఫరా జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఆ తరువాత మామూలే అయింది. వేసవిలో తాగునీటి సౌకర్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురువుతున్నాయని వాపోయారు. తగిన చర్యలు తీసుకొని రక్షితనీటిని నిరంతరం సరఫరా పునరుద్దరించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

⌘ మండలంలోని బొంతవారిపాలెం గ్రామ రక్షిత నీటికోసం 10ఏళ్ల కిందట రూ.10లక్షలు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఇది ఉత్సవ విగ్రహంగానే మిగిలిపోయింది. ఈ గ్రామాన్ని చుండి-చెర్లోపాలెం రక్షితపథకానికి అనుసంధానం చేశారు. పైప్‌లైన్‌ను నేరుగా ఇంటింటికి అమర్చారు. ఈ పథకం సైతం అరకొరగా సాగుతుంది.

⌘ తరచూ మోటార్లు పాడైపోవడం, విద్యుత్ సరఫరాలోపించడం, పైప్‌లైన్ లీకేజి కావడం తదితర కారణాల వలన సక్రమంగా నీరు రావడం లేదు. దీంతో స్థానికంగా బోర్, మోటారుతో మరొక పథకం ఏర్పాటు చేశారు. ఈ రెండు పథకాల ద్వారా ప్రజలు కాలం గడుపుకుంటున్నారు. తాజాగా చుండి -చెర్లోపాలెం పథకం పూర్తిగా నిలిచిపోయింది. భూగర్భజలాల సామర్థ్యం అడుగుంటిపోవడంతో స్థానిక పథకం పూర్తిస్థాయిలో చాలడంలేదు. పైగా ఇది కొత్త కాలనీకి దూరంగా ఉంది. కూలీనాలీ చేసుకునే జనం తాగునీటికి గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని సాదం వెంకటేశ్వర్లు, పెరుగు నాగేంద్రరావు, పెరుగు హరికృష్ణ తదితరులు వివరించారు. ఈవిషయం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పలువురు తెలిపారు. అయినా ఒక్క రోజే సరఫరా చేశారని, ఆ తరువాత మామూలైందని ఆయన తెలిపారు. పలు సభలు సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యే వేసవిలో తాగునీటి అమలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచిస్తున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు.

⌘ ప్రభుత్వం తాగునీటి కోసం లక్షలాదిరూపాయలు వెచ్చిస్తుంటే స్థానిక అధికారుల అశ్రద్ధ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నిర్వీర్యం అవుతుంది. గత 26 రోజులుగా రక్షిత నీటి సరఫరా పూర్తి నిలిచి పోయింది. అంతకు ముందు అప్పుడప్పుడు అరకొరగా వస్తుండేది. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవ లక్ష్యంగా కమిటీ పనిచేయాలి

**⌘ ఆసుపత్రి అభివృద్ధికి కమిటీ సభ్యుల సహకారం తీసుకోండి**

**⌘ ఆసుపత్రిలో మెరుగైన వసతుల కల్పనకు కృషి**

**⌘ జిల్లా కలెక్టర్ ఆనంద్**





**నెల్లూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త వైద్యం** పేదలకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. మంగళవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మడపర్తి శ్రీనివాసులు, సయ్యద్ అబీదా సుల్తానా, వీరబ్రహ్మారెడ్డి, మొగరాల సురేష్, వైద్యులు, సిబ్బంది హాజరయ్యారు. తొలుత డిసెంబరు 18న నిర్వహించిన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, ప్రస్తుత సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదించిన అజెండా అంశాలను డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆసుపత్రి ఆవరణలో షాపులను ఏర్పాటు చేసి వాటి ద్వారా వచ్చే అద్దెను ఆసుపత్రి అభివృద్ధికి వినియోగించుకునేందుకు అజెండాలో ప్రతిపాదించారు. ఆసుపత్రి ఆవరణలో వున్న ఎఆర్‌టి సెంటర్‌కు వాటర్ సప్లయ్‌కు రూ.8లక్షల అంచనాలతో పనుల ఆమోదం కోసం ప్రతిపాదించారు. ఆసుపత్రిలో నాలుగుచోట్ల ఆర్వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.80వేల ఖర్చు చేసేలా ప్రతిపాదించారు. ఆసుపత్రిలో 100 చైర్స్, ఎస్కెటెప్ చైర్స్ 40, ఎగ్జిక్యూటివ్ టెబుల్స్ 20, వాల్‌మోంటెన్ ప్యాన్స్ 60, రిఫ్రిజిరేటర్స్ 20, అల్‌మారాలు 10 కొనుగోలుకు ఆరోగ్యశ్రీ నిధులు వినియోగానికి అనుమతి కోరుతూ కమిటీ ముందు ప్రతిపాదించారు. ఎంసిహెచ్ బ్లాక్ 3వ ఫ్లోర్‌లో ఫ్లోరింగ్, ఇతర మరమ్మతులకు రూ.4 లక్షలు, ఆసుపత్రిలో పలు విభాగాల్లో 26 ఏసీల కొనుగోలుకు అనుమతి కోరుతూ కమిటీ ముందు ప్రతిపాదించారు. ఫార్మసీ విభాగంలో వాక్ ఇన్ కూలర్, స్టేకర్ విత్ పెల్లెట్స్ కొనుగోలు చేయాలని అజెండాలో ప్రతిపాదించారు. అజెండాలోని అంశాలపై కలెక్టర్, కమిటీసభ్యులు, వైద్యులు, సిబ్బంది క్లుప్తంగా చర్చించి అందరి ఆమోదం మేరకు అజెండాను ఆమోదించారు. అలాగే ఆసుపత్రిలో వున్న పేయింగ్ గదులను రూ.500చొప్పున అద్దెకు ఇచ్చేలా నిర్ణయించారు. ఆసుపత్రిలో ఖాళీగా 60 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతం కంటే కూడా ఇప్పుడు ఆసుపత్రి పరిస్థితి మెరుగుపడిరదని, వైద్యులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించాలన్నారు. ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన అంశాలు, చిన్న చిన్న రిపేర్లు, మౌలిక వసతులుమొదలగు సమస్యలను వారివారి స్థాయిలోనే చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. వచ్చే సమావేశంలోగా వైద్యులు, సిబ్బందికి చెల్లించాల్సిన నగదు ప్రోత్సాహకాలను వెంటనే వారికి చెల్లించాలని ఆదేశించారు. ఈ హాస్పిటల్ విధానాన్ని మరింత మెరుగుపరచాల న్నారు. 24 గంటలు ల్యాబ్స్ పనిచేసేలా చూడాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సమాచారం, అజెండా అంశాలను కమిటీ సభ్యులకు ముందుగా సమాచారం ఇవ్వాలని, వారి మెయిల్స్‌కు, రిజిష్టరు పోస్టుల ద్వారా ముందుగానే సమాచారం అందించాలన్నారు. కమిటీ సభ్యుల సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారిని సమన్వయం చేసుకుంటూ ఆసుపత్రి అభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆసుపత్రిలో రోగుల కోసం ఒక అన్యాక్యాంటీన్‌ను ఏర్పాటుచేయాలని కలెక్టర్‌ను కోరగా, అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలను డిఎంఅండ్‌హెచ్‌వో ద్వారా డిప్యూటేషన్‌పై ఆసుపత్రికి కేటాయిస్తే విధులకు ఆటంకం ఉండదని, ఈమేరకు చర్యలు తీసుకోవాలని సభ్యులు కలెక్టర్‌ను కోరారు. టాయిలెట్లు సక్రమంగా వెలగడం లేదని, శానిటేషన్ ఇంకా మెరుగుపడాల్సి వుందని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు సూచించిన అంశాలను పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో ఏసి సుబ్బారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుజాత, డిసిహెచ్ఎస్ పరిమళ, వైద్యులు నరేంద్ర, మస్తాన్‌బాషా, గోవిందు, సుశీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి అరెస్ట్

**నెల్లూరు క్రైమ్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** అమాయకులకు రుణాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులో ముద్దాయిగా ఉంటూ తప్పించుకు తిరుగుతున్న మిరియాల వెంకటరమణయ్య ను నెల్లూరు చిన్న బజార్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. గతంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని, నిరుపేద దళితులకు రుణాలు ఇప్పిస్తానని మోసం చేయడంపై మిరియాల వెంకట రమణయ్య పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. పోలీసులకు కల్లగప్పి అరెస్టు వారెంట్ కి చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న మిరియాల వెంకటరమణయ్యను ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. ఎస్సీ కార్పొరేషన్ లో ఎస్సీలకు లోన్లు ఉద్యోగాలు పేరిట భారీగా మోసాలకు పాల్పడిన ఇతని బాధితుల్లో కొందరు పోలీసు సిబ్బంది కూడా ఉండడం గమనార్హం.

## అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



కోవూరు, **ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా సీడీపీవోలు, సూపర్‌వైజర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ ప్రాజుక్టు డైరెక్టర్ ఎస్ సువర్ణ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం ఆమె కోవూరు, ఇందుకూరుపేట సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌వైజర్లు వారికి కేటాయించిన విధులు , బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా గర్భవతులకు, బాలింతలకు అందజేయడమే కాకుండా వారిలో పౌష్టికాహారంపై మరింత అవగాహన కల్పించేలా చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో సూపర్‌వైజర్ల పనితీరు బాగుందని, ఇదే స్ఫూర్తితో మరింత పనిచేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో కోవూరు , ఇందుకూరుపేట సీడీపీవోలు జ్యోతి, పద్మజ, సూపర్‌వైజర్లు ఉన్నారు.

## పెన్‌కాక్ సిలాడ్ జాతీయ స్థాయి పోటీల్లో గీతాంజలి విద్యార్థి ప్రతిభ



కోవూరు, **ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** బెంగుళూరులోని నార్త్ యూనివర్శిటీలో నిర్వహించి పెన్‌కాక్ సిలాడ్ జాతీయ స్థాయి అంతర్ విశ్వ విద్యాలయ పోటీలో తమ కళాశాల ఈఈఈ ఇంజనీరింగ్ విద్యార్థి జేవీ సుజిత్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించి తమ కళాశాల పేరు ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో మంగళవారం విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అడ్మిషన్ డీన్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ బెంగుళూరు నార్త్ యూనివర్శిటీలో నిర్వహించి ఈ జాతీయ స్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థి అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా ఆట పాటలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉంటామన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల ఈఈఈ విభాగాధపతి డాక్టర్ టి. రవికుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సహాయ పీడీ టి. అనిల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో చైతన్యమాస మంగళవారం పర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లిపత్రాలతో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## నేరాలపై ప్రయాణికులకు అవగాహన



**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** రైళ్లలో తరచూ జరిగే దొంగతనాలు, ఇతర నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ రైల్వే పోలీసులు వినూత్న ప్రక్రియ ప్రారంభించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ సూచనల మేరకు నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో నెల్లూరు జీఆర్పి సీఐ సుధాకర్ ఆద్వర్యంలో నెల్లూరు రైల్వే స్టేషన్‌లో ప్లకార్డ్‌లు ప్రదర్శిస్తూ, మైక్‌ల ద్వారా ప్రచారం చేస్తూ మంగళవారం రాత్రి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రయాణికులను అప్రమత్తత చేస్తూ రైళ్లలో జరిగే దొంగతనాల పట్ల ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. నెల్లూరు, గూడూరు, కావలి రైల్వే ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మంచి ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి



ఏపూరు(రాపూరు), ఏప్రిల్22 **ప్రభాతవార్త** మంచి ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పేరుగు తుందని రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సునంధ తెలిపారు. మంగళవారం మండలంలోని గోనుపల్లి సెక్టార్ పరిధిలోని ఏపూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ ఫక్వాడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన పలు ఆహార పధార్ధాలను ప్రదర్శిం చారు. ప్రతి ఒక్కరు మంచి పోషకాలు వున్న ఆహార పధార్ధాలను తీసుకోవాలని తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు, బాలింతలకు,గర్భవతులకు మంచి పోషక విలువవలు కలిగిన ఆహారాన్ని అందిస్తారని వీటిని అర్హులైన ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ అంగన్‌వాడీ కార్యకర్తలు,చిన్నారులు, గర్భవతులు,బాలింతలు వున్నారు.

## విద్యార్ధులకు ఒలిస్టిక్ కార్డుల పంపిణీ



బోజ్జనపల్లి(రాపూరు),ఏప్రిల్22ప్రభాతవార్త మండలంలోని బోజ్జనపల్లి యంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం 2024.25 సంవత్సరానికి సంబంధించి విద్యార్ధులకు ఒలిస్టిక్ కార్డులను వారి తల్లితండ్రులకు ఆందజేసి విద్యార్ధుల వారిగా వారి సామార్ద్యాలను,గ్రేడ్‌లను తరగతి వారిగా గ్రేడ్‌లను తల్లితండ్రులకు వివరించారు. పాఠశాల ఎ ఫ్లస్ గ్రేడ్ వున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 5 సంవత్సరాల నిండిన వారిని పాఠశాలలో చేర్పించారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్ధులు 6వ తరగతిలో చేరేలా వారికి అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్ధులకు వారి తల్లితండ్రులకు స్వచ్ఛంద్రా,స్వర్ణా ఆంద్రా ..పరిసరాల పరిసుభ్రతపై అవగాహన కల్పించారు. బడి భవిష్యత్ గురించి పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను భోదించం జరుగుతుందని ప్రతి ఒక్కరు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ నాగేంద్ర, వైస్ ఛైర్మన్ ఇండ్ల నాగలక్ష్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. హజరత్తయ్య, విద్యా కమిటీ సభ్యులు, విద్యార్ధులు, వారి తల్లితండ్రులు తదితరులు వున్నారు.

## గంగిరెడ్డిపల్లి ప్రాధమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**ఉదయగిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోని ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల గంగిరెడ్డి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి పాఠశాల ప్రహారిగోడ లేనందున పాఠశాల ప్రహరీ గోడ ఎన్ని మీటర్లు కావాలో కొలిచి తెలియజేయాల్సిందిగా ప్రధానోపాధ్యాయులకు సూచించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంను పరిశీలిస్తూ విద్యార్థులకు మంగళవారం చికెన్‌తో తిధి భోజనం అందించిన ప్రధానోపాధ్యాయురాలు వి.జ్యోతిని అభినందించారు. తదుపరి పాఠశాల కోలోకేటెడ్ అంగన్‌వాడీ కేంద్రంను పరిశీలించి 5సంవత్సరాలు నిండిన విద్యార్థులందరిని గంగిరెడ్డిపల్లి పాఠశాలలోనే చేరే విధంగా తల్లిదండ్రులకు విద్యార్థులకు ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. పాఠశాల రికార్డులన్నీ పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు వి.జ్యోతి, సీఆర్ఎంటీ ఇనాయతుల్లా పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**వింజమూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండలంలో పంచా యతీరాజ్ దినోత్సవ వేడుకలు 24వ తేదీన నిర్వహించాలని ఎంపీడీఓ కే.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించేందుకు తగిన సూచనలు అందజేశారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు, అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యంతో అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాల్సిందిగా కార్యదర్శులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక కింద ప్రణాళిక చేయబడిన కనిపించే ఆస్తులకు శంకుస్థాపన వాల్ ఆఫ్ గవర్నెన్స్ లేదా పంచాయతీ అచీవ్‌మెంట్స్ గ్యాలరీని ఏర్పాటు చేయుట పంచాయతీ విరాసక్తి యొక్క మ్యాపింగ్ ఇందులో 100 సంవత్సరాల వారసత్వ నిర్మాణాలు లేదా సాంస్కృతిక సంప్రదాయాల గుర్తింపు, వటిని గ్రామ సూచిక బోర్డులపై ప్రదర్శించడం చేయాలి. అదే విధంగా మండల స్థాయిలో నా పంచాయతీ నా ప్రైడే అనే నినాదంతో పంచాయతీ రాజ్ దినోత్సవం వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు అందరూ మండల స్థాయి అధికారులు ఎంపీటీసీ సభ్యులు హాజరై కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## చెరువు పూడిక తీత పనుల పరిశీలన



**వింజమూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** వింజమూరు మండలం ఊటుకూరు గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా జరుగుతున్న చెరువు పూడిక తీత పనులను ఏపీవో సుభాషిణి పరిశీలించారు. కూలీల యొక్క మస్టర్‌ను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కూలీలకు కనీస కూలీపడే విధంగా పనులు చేయించాలని క్షేత్ర సహాయకులకు తెలిపారు. ఉదయాన్నే ఆరు గంటలకు పనుల్లోకి వెళ్లి 10 గంటల వరకు పనులు చేయాలని అప్పుడే నిర్దేశించిన కూలీ వస్తుందని ఆమె తెలిపారు. కొలతల ప్రకారం పనులు చేయని యెడల సక్రమంగా కూలీ రాదని ఆమె తెలిపారు. కాబట్టి నిర్దేశించిన సమయంలో నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేసి 300 రూపాయలు కూలీని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు క్షేత్ర సహాయకురాలు బి.నాగేశ్వరి కూలీలు ఉన్నారు.

## ఘనంగా పదవీ విరమణ వేడుకలు



**వింజమూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** వింజమూరు మండలం కాటేపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంకినపల్లి లక్ష్మీరెడ్డి పదవీ విరమణ వేడుకలను ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ఆడిటర్ జనరల్ పి.కిషోర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ లక్ష్మీరెడ్డి ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాల నిర్వహణ సక్రమంగా ఉండేలా నైపుణ్యతగా నిర్వర్తించారని వారు అన్నారు. అదే విధంగా ఉపాధ్యాయులతో సామరస్య పూర్వకంగా వ్యవహరిస్తూ ఎవరికి మనస్సు బాధపడే విధంగా తన ప్రవర్తన లేకుండా పాఠశాల విధులను నిర్వర్తించేవారు. ఆయన అనేక మంది విద్యార్థులను వారి జీవితాలకు ఒక గమ్యాన్ని చూపించి వెలుగును పంచారన్నారు. అనంతరం లక్ష్మీరెడ్డి సతీమణి సంపూర్ణ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమం



**కందుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** కందుకూరు ప్రాజెక్టు బి సెక్టార్‌లోని దూబగుంట అంగన్‌వాడీ కేంద్రంలో సీడీ పీఓ, కే.షర్మిష్ట ఆదేశాల మేరకు, పోషణ పక్వాడా ముగింపు కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భందాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండు సంవత్సరాలు పూర్తయ్యే వరకు వెయ్య డేస్కేర్ అని అంటారు. ఈ సమయంలో సరైన పోషక ఆహారం తీసుకోవడం వలన పిల్లలు ఎదుగుదల చాలా బాగుంటుందన్నారు. ఈ సమయంలోనే మెదడు అభివృద్ధి చెందుతుంది, కాబట్టి సరైన సమయంలో పిల్లలకు సరైన పోషకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ ఎల్.లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్.మాధవి, ఎం.బేబి, జాన్సీ, వై.స్వాతి, బి.సునీత, డి.అనూష, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.

## గర్భవతులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి



ఆత్మకూరు, ఏప్రిల్22,ప్రభాతవార్త: ఆత్మకూరు మండలంలోని సి.హెచ్.యడవల్లిలో ని ఎడబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త శాంతమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ ఎన్.కె.నారాయణమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 15రోజుల పాటు నిర్వహిం చిన పోషన్‌పక్వాడా కార్యక్రమాల్లో అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో గర్భవతులు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాల గురించి తెలియజే శామన్నారు. ఈపక్షోత్సవాల ముఖ్య ఉద్దేశం తల్లీ, బిడ్డ వెయ్యిరోజుల సంరక్షణ అని , గర్భవతులు, బాలిం తలు , చిన్నారుల పెరుగుదల గురించి తల్లిదండ్రులు శ్రద్ధతీసుకోవాలన్నారు. బిడ్డ గర్భంలో పడినప్పటి నుండి 2సంవత్సరాల లోపు ఉన్న సమయం ప్రాముఖ్యతను వివరించారు. పోషన్‌పక్వాడా ముఖ్య ఉద్దేశమే ప్రజలకు ఈ విషయంలో అవగాహన కల్పించాలనేదేనన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీప్రసన్న, వెంగమ్మ, నిరోషా,ఆశవర్కర్లు, హెల్పర్లు, గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## భూమి, నీరు, గాలిని సంరక్షించుకోవాలి



**బిట్రగుంట ఏప్రిల్ 22 ప్రభాతవార్త** సమాజంలో భూమి నీరు గాలిని సంరక్షించుకొని, పర్యావరణ పరిరక్షణ కొంకు కృషి చేయాలని కావలి లోక్ అదాలత్ సభ్యులు మాలకొండ రెడ్డి తెలిపారు. బోగోలు మండలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రపంచ ధరిత్రి దినోత్స వం సందర్భంగా మొక్కలు నాటి పర్యా వరణ పరిరక్షణ పై బాలికలకు అవగా హన కల్పించారు. జల కాలుష్యం,వాయు కాలుష్యం నివారించి సారవంతమైన భూమిని కాపాడుకొని, వృక్ష సంపదను పెంచుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ పద్మావతి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకం నియంత్రించి గుడ్డ సంచులు, విస్తరాకులు ఎక్కువగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల నుండి పంచాయతీ సొమ్ము తిన్నది రఫీ : సర్పంచ్



విడవలూరు, ఏప్రిల్ 22, **ప్రభాతవార్త:** మండలంలోని ముదివర్తి పంచాయతీలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి సర్పంచ్‌గా గెలుపొందడం జరిగిందని సర్పంచ్ నిర్మలమ్మ పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. నాలుగేళ్ల క్రితం టిడిపి అభ్యర్థిగా ఉండాలని ముస్లిం మైనార్టీ నాయకులు రఫీ ఒత్తిడి చేసి పోటీలోకి దింపారు. సర్పంచ్‌గా గెలుపొందినప్పటినుండి ఇప్పటివరకు పంచాయతీలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఒక్క రూపాయి కూడా తమకు చెందలేదని ఆరోపించారు. నాలుగు సంవత్సరాల నుండి లేని వ్యతిరేకత ఇప్పుడు పుట్టుకు వచ్చిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న రఫీ సమాధానం చెప్పాలన్నారు. 8 నెలల నుండి వార్డు నెంబర్లను తన సొంతం చేసుకుని సర్పంచ్‌గా నాపై బురద చల్లడం ప్రారంభించేశాడు. ఎందుకు ఈ ఆరోపణలు చేసిన తప్పు ఏంటో తెలియపరచాలని సవాల్ విసిరారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పట్ల సంబంధిత అధికారులను పక్కదారి పట్టించి చెక్ పవర్ రద్దు చేయడం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఈ సమస్య పట్ల స్థానిక ఎమ్మెల్యేను కలవడం ఆమె స్పందించి పంచాయతీ అభివృద్ధి పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా పనులు సాగించాలని భరోసా ఇచ్చినట్లు ఆమె తెలిపారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు హిమాని భాష మాట్లాడుతూ గత పంచాయతీ ఎన్నికల్లో రఫీతో కలిసి టిడిపి అభ్యర్థి గెలిపించుకోవడం జరిగింది. ఇప్పుడు ఎందుకు ఈ ఆరోపణలు చేస్తున్నారో తెలియడం లేదు సర్పంచ్ తప్పు చేసినట్లుగా అయితే నిరూపించాలి, ఈ సమస్యపై ఎమ్మెల్యే స్పందించాలని కోరారు. దళిత మహిళ అని చూడకుండా అనేక విధాలుగా గ్రామ సర్పంచిని ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీకాంతమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, ఏప్రిల్22 ప్రభాతవార్త** కావలి పట్టణ విష్ణాలయం వీధిలో ప్రముఖ బంగారు వ్యాపారి నల్లూరి ఆదిశేషయ్య సతీమణి స్వర్గీయ లక్ష్మీకాంతమ్మ ఉత్తరక్రియల్లో వైసిపి కావలినియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని చిత్రపటానికి పూలమాల ఉంచి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైసిపి పట్టణ అద్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి జిల్లా ఉపాద్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, వైసిపి వాణిజ్యవిభాగం జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటరమేష్, వైసిపి నేతలు చెన్ను ప్రసాదరెడ్డి, షేక్.షాహుల్ హమీద్, రేమాల వెంకటరామిరెడ్డి, సుదాచారి, నాగాచారి, నల్లూరి రాము, నల్లూరి మాధవ, పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నయ పంటలు సాగు చేయండి



**బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని చల్లాయపాళెం రైతు సేవా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షల మీద మరియు ప్రత్యామ్నయ పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బాగంగా జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి మాట్లాడుతు ప్రత్యామ్నయ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.వరి మాగాణి పొలాలలో మినుము,పెసర, చల్లుకోవాలని తెలియజేశారు. తద్వారా ఆదాయం పొందడమే కాకుండా నేలను సారవంతం చేసుకోవచ్చునని తెలిపారు. అలాగే నేలలో నత్రజని శాతాన్ని పెంచుకోవచ్చునని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఏడిఏ నర్సోజిరావు మాట్లాడుతు రైతులు మొక్కజొన్న పంటను సాగు చేసుకోవాలని భవిష్యత్తులో మొక్క జొన్న పంటకు మంచి ఆదాయం ఉంటుందని తెలియజేశారు. ఏడిఏ శేషగిరిరావు మాట్లాడుతు భూసార పరీక్షల ఆవశ్యకతను గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫారసు చేసుకోవచ్చునని అన్నారు. భూసార నిర్ధారణ చేసి రైతులు వేయదలచిన పంటలకు నత్రజని, బాస్వరం, పొటాష్, సూక్ష్మపోషక ఎరువుల మోతాదును నిర్ణయించవచ్చునని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.సురేంద్రరెడ్డి, విఏఏ పి.కళ్యాణి, రైతులు పాల్గోన్నారు.

## వీఆర్వోలు శిస్తు వసూలు వేగవంతం చేయాలి తహసిల్దార్



కొడవలూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండలంలో రైతుల వద్ద సాగునీరుపై శిస్తు వసూళ్లు వేగవంతం చేయాలని తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్ బి, అడంగల్, పాస్ పుస్తకాలు, భూమి విస్తరణం రైతుకు సంబంధించి తప్పిదాలు గుర్తించి రైతుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని తెలియజేశారు. మండలంలో మొదటి పంట సాగునీరు ఆశిస్తూ వసూళ్లు వేగవంతం చేసి అందుబాటులో ఉన్న సచివాలయంలో చెల్లించే విధంగా రైతులకు తెలియజేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ సునీల్ రెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

**కొడవలూరు, ఏప్రిల్ 22, ప్రభాత వార్త :** మండలం రైల్వే స్టేషన్ మూడవ లైన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందాడు. గుర్తించిన స్థానికులకు వివరాలు ఎలా ఉన్నాయి. మృతుడు వయసు 40 నుండి 45 వయసు ఉంటుందని పింక్ పసుపు రంగు చుక్క, సిమెంట్ రంగు లుంగీ ధరించినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలపై జీఆర్పిఎస్ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విడవలూరులో నేత్రదానం



విడవలూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని బ్యాంకు వీధిలో పల్లాల రమణమ్మ (65) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. మనసేవ సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ల శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కి కుటుంబ సభ్యుల సహకారంతో నేత్రాలు దానం చేశారు. మోడరన్ ఐ టెక్నీషియన్ నాగేశ్వరావు నేత్రాలను స్వీకరించారు.

## నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రాక



విడవలూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త : మండల ప్రజా సమస్యల పట్ల తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మండల ప్రజా పరిషత్ కార్యాలయంకు రావడం జరుగుతుంది అని ఎంపీడీవో నగేష్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

## కండలేరులో 45.727 టీయంసీల నీటిమట్టం



రావూరు, ఏప్రిల్22ప్రభాతవార్త మండలంలోని కండలేరు జళాశయంలో మంగళవారం ఉదయం నాటికి జళాశయంలో 45.727 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 345 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 30 క్యూసెక్కుల చోప్పున మొత్తం 425 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

# ఎంపియుపి స్కూల్‌ను హైస్కూల్‌గా మార్చాలి



**అనంతసాగరం, ఏప్రిల్22,ప్రభాత వార్త:** మండలంలోని పడమటికంభం పాడులోని ఎంపియుపి స్కూల్‌ను జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలగా మార్చాలని పాఠశాల ఎదుట స్థానిక గ్రామస్తులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆ పాఠశాలలో 1నుంచి5 వ తరగతి వరకు 100మంది విద్యార్థులున్నారని, 6నుండి8వ తరగతి విద్యార్థులు 55మంది ఉన్నారన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం అన్ని వసతులు ఉన్నాయన్నారు. పాఠశాలను హైస్కూల్ మార్చడం ద్వారా గ్రామంలోని బడుగు, బలహీన , మైనార్టీ వర్గాల విద్యార్థులకు గ్రామంలోనే ఉన్నత విద్యను అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.ఈ విషయమై జిల్లా , మండల విద్యాధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.

# ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన



**సైదాపురం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండల పరిధిలోని మర్లపూడి, చాగణం గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి ప్రత్యామ్నయ పంటలు,భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి వేసిన తరువాత పొలంలో ఉన్న తేమతో ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, నువ్వులు తదితర పంటలు పొలం ఖాళీగా ఉండకుండా వేసుకుని లబ్ది పొందాలని తెలిపారు. అలాగే రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కందాటి దయాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి, రైతులు పాల్గొన్నారు

# దళితులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి



**సైదాపురం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో దళితులపై మైనింగ్ మాఫియా పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మైనింగ్ మాఫియాపై తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీ పోలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల్లో దళితులపై అక్రమ కేసులు, పోలీసుల వేదింపులు, భూ ఆక్రమణలు అధికార పార్టీ అండదండలతో యధేచ్చగా కొనసాగుతున్నా వాటిని అరికట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సైదాపురం మండలంలో మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తున్న తహశీల్దార్, కొంత మంది రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి లేని దళితులకు భూ హక్కు కల్పించాలని, ఈ కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమైఖ్య జిల్లా అధ్యక్షుడు కే.రమేష్, ప్రగతిశీల మహిళ సంఘ నాయకులు మమత, నాగమణి, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**సైదాపురం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండల కేంద్రమైన సైదాపురంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి డీపీ పోలయ్య ఆధ్వర్యంలో కామ్రేడ్ లెనిన్ 155వ జయంతిని పురస్కరించుకుని సీపీఐఎంఎల్ పార్టీ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సదరన్ క్యాంపుల్లో దివ్యాంగులకు వసతులు కల్పించాలి



**కావలిరూరల్, ఏప్రిల్22 ప్రభాతవార్త** సదరన్ క్యాంపులకు వెరిఫికేషన్‌కు వచ్చే దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా సదరన్ క్యాంపుల్లో వసతులు ఏర్పాటుచేసి వారికి అండగా నిలవానలని కావలి, ముసునూరు దివ్యాంగులకాలనీ అధ్యక్షులు, టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకటరావు తెలియ చేశారు. మండవ వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రంలో సదరన్ క్యాంపులు జరిగే అన్ని ప్రదేశాలలో దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కావలి ఏరియా వైద్యశాలనందు వైద్యశాల మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ పద్మావతి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రమీలారాణికి వినతిపత్రం అందచేసి మాట్లాడారు. రాష్ట్రంలో విభిన్నప్రతిభావంతులకు సదరన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రాలలో అనేకచోట్ల భోజనసదుపాయం, నిలబడడానికి నీడలేక, కోర్చోవడానికి కుర్చీలులేక కనీసం మంచినీటి వసతికూడా లేక, రవాణాసౌకర్యంలేక ఎంతో ఇబ్బందులు పడుతున్నారని తెలియచేశారు. ఈ సమస్యల గురించి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం అందచేయడం జరిగిందని తెలియచేశారు. నేను కావలిలో ఉంటున్నాను కనుక కావలి ఏరియా వైద్యశాలకు దివ్యాంగులకు వసతులు కల్పించాలని సిఎంఓ కార్యాలయంనుండి ఆదేశాలు అందడం జరిగిందని తెలియచేశారు. కావలి ఏరియా వైద్యశాలలో నివడానికి నీడ, మంచినీటి వసతి కల్పించారని భోజన వసతి, రవాణా సౌకర్యం కల్పించలేదని తెలియచేశారు. వసతులు విషయం ఏరియా వైద్యశాలవారు నా దృష్టికి తీసుకురాగా ఇది కావలి సదరన్ క్యాంపులో సౌకర్యాలు కల్పించే సమస్యమాత్రమే కాదని రాష్ట్రవ్యాప్త సమస్య అని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరడం జరిగిందని తెలియచేశారు. ఎటువంటి కాలయాపన చేయకుండా సిఎంఓ కార్యాలయంవారు వెంటనే రాష్ట్రవ్యాప్తంగా సదరన్ వెరిఫికేషన్‌కు వచ్చే దివ్యాంగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. సెక్షమ్ కావలి డివిజన్ కన్వీనర్‌వేణుగోపాల్‌రావు,దివ్యాంగుల నాయకులు తల్లిబోయిన శ్రీనివాసులు, మైలాపల్లి శంకర్, ఎపిఎం, డిఆర్‌డిఎ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్



**ఆత్మకూరు, ఏప్రిల్22,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంకొరకు ఆత్మకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ప్రత్యేక విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలపరిష్కార వేదిక చైర్‌పర్సన్ రిటైర్డ్ జడ్జ్ వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు వినియోగదారులు అర్జీలు ఇచ్చారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి పరిశీలిస్తామని అదాలత్ అధికారులు అర్జీదారులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమానికి ఆత్మకూరు విద్యుత్‌శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎడిఇ చిన్నస్వామి నాయక్, ఎడిలు, డివిజన్ ఏఇలు , పట్టణ ఏఇ జమీలాబేగం, ఇతర ఏఇలు, పట్టణ ప్రజలు, పట్టణ సిపిఎం నాయకులు, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో విద్యుత్ లోక్ అదాలత్



**ఆత్మకూరు,ఏప్రిల్22,ప్రభాతవార్త:** ఆత్మకూరులో మంగళవారం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో విద్యుత్ అదాలత్ అధికారులకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నెల్లూరు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ డివిజన్ పరిధిలో 2 వేల మంది పైగా రైతులు వ్యవసాయ కనెక్షన్ల కొరకు ఒక్కొక్క కనెక్షన్‌కు 6వేల రూపాయల వంతున డిపాజి ట్లు చెల్లించి ఉన్నారని,ఈ మొత్తం ఇప్పటికే రెండు సంవత్సరాలకు పైబడి జరిగిందని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాలు రైతులకు అందించడంలో విద్యుత్ అధికారులు విఫలమయ్యారన్నారు. దీనివలన రైతులు తమ పైర్లను పండించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఈవిషయమై విద్యుత్ డివిజనల్ ఇంజనీర్‌ను పలుమార్లు కలిసి వివరించినా ఆ సమస్య పరిష్కారం కాలేదన్నారు. అనంతరం ఈసమస్యపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించి రైతులను ఆదుకోవాలని వారు వినతిపత్రం అందజేశారు.

పట్టణంలోని స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులకు సంబంధం లేకుండానే బిగిస్తున్నారని, పాత మీటర్లకు జవాబుదారీ తనం ఎవరుంటారని భవిష్యత్తులో స్మార్ట్ మీటర్లకు పైసలు వసూలు చేయరని నమ్మకం ఏమిటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల విషయమై వినియోగదారులతో సదస్సును ఏర్పాటు చేయాలని వివరంగా స్మార్ట్ మీటర్ల గురించి వినియోగదారులకు తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ అధికారులు, రైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు నేడే సచివాలయం ప్రారంభోత్సవం



**వలేటివారిపాలెం ఏప్రిల్ 22, ప్రభాతవార్త** మండలంలోని అయ్యవారిపల్లె, అంకభూపాలపురం గ్రామాల్లో నిర్మించిన సచివాలయ భవనాలను ఎట్టకేలకు బుధవారం అనగా ఈ నెల 23వతేదీన ప్రారంభించనున్నారు.ఈ మేరకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభోత్సం చేయనునన్నట్లు అయ్యవారిపల్లె తెదేపా యువనేత వేమూరి రాజా తెలిపారు.అయ్యవారిపల్లెలో ఉపాధిపథకం నుంచి రూ .40లక్షలు ,గ్రామపంచాయతీ నుంచి మరో రూ.5లక్షలు వెచ్చించి అన్ని వసతులుతో కూడిన సచివాలయ భవనాన్ని ఏడాది కిందటే నిర్మించారు.అయినా అధికారుల నిర్లక్ష్యం అశ్రద్ధ కారణంగా పంచాయతీ నిధులను వెచ్చిస్తూ అద్దెభవనంలోనే నిర్వహిస్తూవచ్చారు.దీంతో ఈభవనం ఉత్సవ విగ్రహంగా అసాంఘిక కార్యక్రమా లకు నిలయంగా మారింది.ఈ దుస్థితిపై ప్రభాతవార్త పలుమార్లు వార్తకథనాలు ప్రచురించింది.స్థానిక తెదేపా నేతల విజ్ఞప్తి,ఎంపీడీవో నరేంద్రదేవ్ సూచనలు,ఎమ్మెల్యే చొరవతో ఈ భవనాలను బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాజా తెలిపారు.అదేవిధంగా అంకభూపాలపురం సచివాలయ భవనాన్ని సైతం బుధవారమే ఎమ్మెల్యేచే ప్రారంభించనున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం తెలిపారు.

# 24 న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలులో శాంతియుత ర్యాలీ



**బిట్రగుంట ఏప్రిల్ 22ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా బోగోలులో శాంతియుత ర్యాలీ ఈ నెల 24వ తేదీ నిర్వహిస్తునట్లు మైనారిటీ నేతలు షేక్. నూరుద్దీన్, జహీర్‌లు తెలిపారు. విశ్వనాధరావుపేట పంచాయతీ లోని ఇబ్రహీంపేటలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. శాంతియుత ర్యాలీ బోగోలు సెంటర్ నుండి ఇబ్రహీంపేట జామియా మసీదు వరకు జరుగుతుంది అని, కావున ప్రతి ముస్లిం సోదర, సోదరీమణులందరూ ప్రజాస్వామ్యవాదులు, అంబేద్కర్ వాదులు,లౌకికవాదులు, వామపక్ష పార్టీలు, అందరు పాల్గొని ఈ శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును, నిరసనగా ఈ నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకునేంతవరకు తమ నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కాబట్టి ప్రతి ముస్లిం సోదర సోదరిమణులు, ప్రతి ఒక్కరు కార్యక్రమానికి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ముస్లిం జేఏసీ నాయకులు షేక్ సిరాజ్, మహబూబ్ బాషా,షేక్ గౌస్ బాషా, అహ్మద్ భాషా, జాఫర్, సయ్యద్ కలీమ్, హబ్బు, షేక్ జిలాని, సయ్యద్ సుభాని, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# జువ్వలదిన్నె లో అనధికారికంగా లేఔట్లు

## అక్రమంగా గ్రావెల్ తరలింపు



**బిట్రగుంట ఏప్రిల్ 22 ప్రభాతవార్త** బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామ పంచాయతీ పరిధిలో పుట్టగొడుగులుగా అనధికార లేఔట్లు వెలుస్తున్నాయి. ఈ లేఔట్లకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ మట్టి తరలింపులో అధికార పార్టీ నాయకులతో పాటు స్థానిక అధికారులకు వాటాలు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.స్థానిక అధికారులకు జేబులు నిండటంతో అక్రమ లేఔట్లను ప్రోత్సహిస్తూ వారి అరాచకాలను చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్న స్థానిక రెవెన్యూ అధికారులు గతంలో అనేక లేఔట్లకు పర్మిషన్ లేదని జెసిపి తో ధ్వంసం చేసి మరి ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావటంలేదు.ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అక్రమ లేఔట్లను ఆపి చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నటువంటి స్థానిక అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

# మోటార్ వాహన చట్టం అతిక్రమిస్తే చర్యలు తప్పవు



**సీతారామపురం ఏప్రిల్ 22 ప్రభాతవార్త** మోటార్ వాహన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్.ఐ.జి శివకృష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం బస్టాండ్ సెంటర్‌లో డ్రంకన్న డ్రైవ్ టెస్టు నిర్వహిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతు మోటార్ వాహన చట్టం ప్రకారం వాహనదారులు వాహనానికి సంబందించిన పత్రాల ను కలిగి వుండాలని మరియు వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు లైసెన్స్‌లు కలిగి వుండాలని అన్నారు. హైవిలోడుతో వెళుతున్న వాహనాలకు జరిమానా తప్పదని అన్నారు.మద్యం త్రాగి వాహనలు నడిపి చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఒక్కరు సరైన పత్రాలు చూసుకోని వాహనాలతో రోడ్డుపైకి రావాలని అన్నారు.సకాలంలో పెండింగ్ చలానాలు చెల్లించాలని తెలిపారు.

# పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి



**బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త** పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని బుచ్చిరెడ్డిపాళెం బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులు కోరారు.ప్రధానో పాధ్యాయురాలు సుజాత నేతృత్వంలో వారు గ్రామంలో పిల్లలు ఉన్న ఇండ్లకు వెళ్ళి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అన్ని విదాల విద్యార్థులకు ప్రోత్సహాన్ని అందిస్తుందని వారు తెలిపారు. ఒక్కసారి బాలికల హైస్కూల్‌లో వస్తున్న ఫలితాలు పరిశీలించాలని వారు కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా బుక్స్,యూనిఫాంలు ఇస్తుందని, మద్యహ్నా బోజనం పెడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలో పిల్లల్ని చేర్పించాలని వారు కోరారు.

# గొల్లపల్లిలో పౌష్టికాహార పక్షోత్సవం



చేజర్ల ఏప్రిల్ 22 ప్రభాతవార్త చేజర్ల మండలంలో గొల్లపల్లి -1 అం గన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వ హించారు. ఐసిడిఎస్ చేజర్ల సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్ సురేఖ సూచనలు సలహాలు మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# నేడు కనిగిరి రిజర్వాయర్ మత్యకార సంఘంపై విచారణ



బుచ్చి ఏప్రిల్ 22 ప్రభాతవార్త మూడు మండలాలకు సంబందించిన కెడి రిజర్వాయర్ మత్యకార సొసైటీ పైన సొసైటీ ప్రెసిడెంట్ అర్దూరు కామేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం 11 గంటలకు రిజర్వాయర్ వద్ద విచారణ జరగనున్నట్లు సొసైటీ ప్రెసిడెంట్ కామేశ్వరరావు తెలిపారు. ఈ విచారణకు కావాలి ఎప్‌డిఓ వస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కలెక్టరేట్ ఎదుట సిహెచ్‌ఓల ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** క్రమబద్ధీకరించాలని.. దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఓలు) మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భాను మహేష్, కృష్ణవేణి లు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో జిల్లా వ్యాప్తంగా 497 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. తామంతా డాక్టర్ల లాగానే 4 సంవత్సరాల పాటు బీఎస్సీ నర్సింగు, మరో రెండేళ్లపాటు ఎంఎస్సీ నర్సింగ్ కోర్సులు పూర్తిచేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వృద్ధులు, పక్షవాతానికి గురైన వారి కోసం వారి ఇండ్ల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నామన్నారు. ఇలా తాము 12 రకాల వైద్య సర్వీసులు, 14 రకాల పరీక్షలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ తమకు ప్రభుత్వం కేవలం రూ. 25 వేల రూపాయలు మాత్రమే జీతంగా ఇస్తుందన్న వారు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు వచ్చే జీతాలను ఖర్చు పెట్టుకుంటూ వివిధ రకాల శిక్షణలకు ఆరోగ్య కార్యక్రమాలకు హాజరవుతున్నామన్నారు. అదేవిధంగా క్లినిక్ లకు వచ్చే మెటీరియల్ ను కూడా జిల్లా కేంద్రాల నుండి తమ సొంత ఖర్చులతోనే తీసి వెళ్తున్నామన్నారు. ఇక క్లినిక్ ల అద్దెలు ప్రభుత్వం 10 నెలలుగా చెల్లించకపోవడంతో పలుచోట్ల యజమానులు ఒత్తిడి తట్టుకోలేక ఆ అద్దెలు కూడా తామే కడుతున్నామన్నారు. ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమానంగా 28 శాతం వేతన సవరణ చేయాలని, ఆయుష్మాన్ భారత్ క్రింద ఉద్యోగ భద్రత కల్పించాలని, జాబ్ కార్డు ప్రకారం విధులు కేటాయించాలని, క్లినిక్ ల అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని వారుడిమాండ్ చేశారు. అదేవిధంగా ఈపీఎఫ్‌ను పునరు ద్ధరించాలని, సిహెచ్‌ఓలకు ఎఫ్ఆర్ఎస్ హాజరు నుండి మినహాయింపు ఇవ్వాలని, తమను క్రమబద్ధ కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే నిరాహార దీక్షలు ఆందోళన చేస్తామని భాను మహేష్, కృష్ణవేణిలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల ఎంపీ వేమిరెడ్డి సంతాపం



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** క్యాథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం పట్ల నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. పోప్ ఫ్రాన్సిస్ అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. సామాజిక న్యాయం, ప్రపంచ శాంతికి ఆయన అవిశ్రాంతంగా పోరాటం చేశారని కొనియాడారు. లక్షలాది మందికి స్ఫూర్తిని ఇచ్చిన ఆధ్యాత్మిక గురువు పోప్ ఫ్రాన్సిస్ మరణం తనకు బాధ బాధ కలిగించిందని అన్నారు. కేవలం మతపరమైన నాయకుడిగా మాత్రమే కాకుండా, ఆయన నిజమైన మానవతావాది అని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాల్లో కరుణ, వినయం, ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

# శేషారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన పర్వతరెడ్డి



**నెల్లూరు రూరల్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** నెల్లూరు 14 వ డివిజన్ ఏసీ నగర్‌లో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి తండ్రి అయిన కరాది వెంకట శేషారెడ్డి మరణించడంతో వారి పార్థివ దేహా నికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. కరాది వెంకట శేషారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని చంద్రశేఖర్‌రెడ్డి భగవంతుని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. చంద్రశేఖర్ రెడ్డి అక్కడకు విచ్చేసిన స్థానిక వైసిపి నేతలను కలుసుకొని మాట్లాడారు.

# విద్యార్థులకు ప్రోత్సహాకాలు



**కలువాయి ఏప్రిల్ 22 ప్రభాతవార్త** మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలలో మండల ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించినందుకు గాను మంగళవారం కళాశాల నందు ప్రిన్సిపల్ షేక్ మహబూభాషా ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రథమ,ద్వితీయ సంవత్సరం కళాశాల స్థాయిలో ఉత్తీర్ణ సాధించిన ఎం . హారిక 977 (ఎంపిసి ),ఎం మేఘన (975), అదే విధంగా ఎంపిసి,బైపిసి,సిఇసి గ్రూప్‌ల నందు ప్రతిభ కనబరచిన విద్యార్థిని విద్యార్థులకు మెమొంటోలు బహుకరించి వారిని సన్మానించారు. విద్యార్థులనుద్దేశించి మహబూభాషా మాట్లాడుతు జీవితంలో ఉన్నత స్థానానికి రావాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో కూడినటువంటి జీవితాన్ని అలవరచుకోవాలని అన్నారు.బడుగు బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులోఉండే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లల్ని చేర్పించి కళాశాల బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు. కళాశాల అధ్యాపకులు, కృష్ణా ,కిషోర్,దొర బాబు,శ్రీనివా సులు, రామాంజనే యులు ,కల్పన,సుప్రజా,సౌజన్యా తదితరులు పాల్గోన్నారు. అదే విధంగా కళాశాల నందు ఇంటర్ మీడియట్ మొదటి,రెండో వ సంవత్సర అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి



**చేజర్ల ఏప్రిల్ 22 ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి పాఠశాలలు బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి 2 డిసి మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఏటూరు ఎస్‌సి పాఠశాలలో మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో చేజర్ల మండల ద్వితీయ విద్యాశాఖ అధికారి డిసి మస్తానయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మస్తానయ్య మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుట కొరకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామంలో విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సూచించారు.ప్రైవేటు పాఠశాలలకు ఆకర్షించే విధంగా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే టట్టు చేయాలని అన్నారు. నూతక్కి వారి కండ్రిక ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయినందున ఏటూరు పంచాయితీలోని ఐదవ తరగతి పూర్తి అయిన విద్యార్థులందరినీ ఎన్‌వి కండ్రిక ఉన్నత పాఠశాలలో చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన ప్రాథమికోన్నత పాఠశాలలో పరిధిలోని ఉపాధ్యాయులు మరింత కృషి చేసి ఆ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు చేరాలా గ్రామాలల్లో పర్యటించి విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. ఇప్పటికే విద్యార్థుల కోసం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కాగా సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగినేని రమణయ్య,సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆనం పేరారెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, ఏప్రిల్22 ప్రభాతవార్త** కావలి పట్టణ 13వ వార్డు పుల్లారెడ్డినగర్‌లో నివసిస్తున్న ఆనం పేరారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై వైద్యశాలలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటు న్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైసిపి నేతలతో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాదరెడ్డి, అయ్యవారు కృష్ణారెడ్డి, ఎస్‌వి దయాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అపోలో వైద్యశాల సౌజన్యంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



**కావలిరూరల్, ఏప్రిల్22 ప్రభాతవార్త** నెల్లూరు అపోలో వైద్యశాల సౌజన్యంతో ప్రజావైద్యులు మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా అధ్యక్షతన కావలి తహశీల్దారు కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు ప్రజావైద్యశాల నందు మంగళవారం క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు అపోలో వైద్యులు సీనియర్ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ సి.హరిత, ప్రముఖ క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్యనిపుణులు డాక్టర్ జీవివి ప్రసాదరెడ్డిలు పాల్గొని క్యాన్సర్‌వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియచేసి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దగ్గు, ఛెస్ట్‌పెయిన్, ఊపిరి ఆడకపోవడం, బ్లోటింగ్, బ్లీడింగ్ శరీరంలో గడ్డలు, కడుపులోనొప్పి, వెన్నుముక నొప్పి, హఠాత్తుగా బరువు తగ్గడం, మల విసర్జనలో మార్పులు, పుట్టమచ్చలలో మార్పులు, క్యాన్సర్ వలన ఈ విధంగా ఎన్నో మార్పులు వస్తాయని తెలియచేశారు. జీవనశైలిలో మార్పులు, స్థూలకాయం, పొగత్రాగుట, మద్యం సేవించుటవలన కూడా గొంతుక్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలియచేశారు. ఏ విధమైన అనుమానం కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. క్యాన్సర్‌కు హైపటైజ్ వ్యాక్సిన్ వచ్చిందని ప్రతిఒక్కరూ ఈ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని కోరారు. ఆహారపు అలవాట్లు మారాలని, క్యాన్సర్ అనేది దీర్ఘకాలిక వ్యాధి అని, స్క్రీన్ టెస్ట్ చేయించుకుని అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. క్యాన్సర్ వ్యాధివలన భయపడవలసిన పనిలేదని, అన్ని విధములైన వైద్యం అందుబాటులో ఉందని తెలియచేశారు. అనంతరం డాక్టర్ యన్.ప్రభాకర్ నాయుడిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఎంవియన్ ప్రసాదరావు, ఎం.అజిత్‌బాబు,మొగల్ సలీంబేగ్, రాయపాటిదిలీప్‌కుమార్, బి.శారద, దామామధుసూధన్‌రావు, సయ్యద్ ఘనిబాషా, వరప్రసాద్, ఎస్‌కె.జమీర్, ఎస్‌కె.రఫిఅహ్మద్, సిహెచ్.ప్రభయ్య, ఆర్.బాబ్జి, అపోలో వైద్యశాల పిఆర్‌ఓ మాధవ, డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు వైద్యశాల పిఆర్‌ఓ అక్కిలిగుంట ఆనంద్, మరియు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి



**సైదాపురం, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహి స్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడు తూ సచివాలయ సిబ్బంది ఉదయం 10గంటల్లోగా హాజరు నమోదు చేసి అదే విధంగా సాయంత్రం సచివాలయం నుంచి వెళ్లే సమయంలో కూడా హాజరు నమోదు చేసి సమయపాలన పాటించాలని తెలిపారు. మన మిత్ర సర్వేలో కొంచెం వెనుకబడి ఉన్నామని, మరింత ప్రోగ్రెస్ తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదే విధంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు స్కూల్‌లోని టాయిలెట్ విజిట్ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. ముఖ్యంగా చిల్డ్రన్ ఆధార్, బర్త్ సర్టిఫికేట్లు వీలైనంత త్వరలో పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ సర్వీస్ మొత్తం 45వేల రూపాయలు పెండింగ్ ఉన్నాయిని, వెంటనే చలానాలు కట్టాలని ఆదేశించారు. అదేవిధంగా 24వ తేదీన నేషనల్ పంచాయతీ రోజు సందర్భంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వ హించాలని ఆయన అన్నారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన కింద ఉపాధి కూలీలకు ఒక వ్యక్తికి రూ.20లు చెల్లిస్తే రూ.2లక్షల ప్రమాద భీమా వస్తుందని రాష్ట్రీయ స్వస్థ భీమా యోజన రూ.400లు చెల్లిస్తే పలు రకాల ప్రమాద భీమా వస్తుందని ఫీల్డ్ అసిస్టెంట్‌కు తెలియజేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఏపీవో సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి.. లేదంటే కఠిన చర్యలు తప్పవు - ఏఎస్పీ సౌజన్య హెచ్చరిక





**తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని లేదంటే కఠినమైన శిక్షలు ఉంటాయని నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ సౌజన్య హెచ్చరించారు. తోటపల్లిగూడూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల తోటపల్లిగూడూరు పోలీసులు ఒక ముఠాను పట్టుకోవడం జరిగిందని, వారి ఇన విచారించగా వారి వద్ద 25 మోటార్లు వాటిలో సుమారు ఐదు లక్షలు ఉంటుందని, వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ ముఠాలో కత్తుల బావి పొట్లూరు పూర్ణచంద్రరరావు అలియాస్ దాని చౌటు శ్రీనివాసులు అను వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సౌజన్య తెలిపారు. ఈ మోటార్లే కాక ముద్దాయిల వద్ద నుంచి రూ.35వేల రూపాయలు విలువ చేసే ఇనుప పైపులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముద్దాయిలు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈ దొంగతనాలు చేయడం ప్రారంభించారని అందుకే తోటపల్లిగూడూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో పగలు ఎర్రగడ్డలు వ్యాపారం పేరుతో గ్రామాలలో తిరుగుతూ పొలాలలో ఉన్న మోటార్లను గమనించి రాత్రి వేళలో వాటిని తొలగించి తీసుకెళ్లేవారని అలా చెడు వ్యసనాలకు బానిసలై ఈ దొంగతనాలు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. అయితే తోటపల్లిగూడూరు పోలీసులు చాకచక్యంగా వీరిని పట్టుకోవడం హర్షించదగ్గ విషయమని ముత్తుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవి నాయక్ తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డి అలాగే వీటితో కలిపి పని చేసిన టీపీ గూడూరు ముత్తుకూరు కృష్ణపట్నం స్టేషన్ల సిబ్బందిని ఆమె అభినందించి వారికి రివార్డులు అందజేశారు. ముఖ్యంగా యువత చెడు మార్గాలలో వెళ్లడం వల్లే ఇలా దొంగతనాలకు పాల్పడుతున్నారని ముఖ్యంగా మాదక ద్రవ్యాలు అలవాటు చేసుకుని దాంతో పాటు బెట్టింగ్‌లకు అలవాటుపడి ఎలా దొంగతనాలు చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గ్రామాలలో ఎక్కడైనా బెట్టింగ్‌లు ఆడిన పేకాట ఆడిన మాదకద్రవ్యాలకు అలవాటు పడినట్లు మా దృష్టికి వస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె ప్రజలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు ఎస్సై వీరేంద్రబాబు, హెబ్ కానిస్టేబు ల్ వాసు, జగదీష్, వెంకటేశ్వర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని శాఖల సమిష్టి కృషితో బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం




**పెంచలకోన(రాపూరు), ఏప్రిల్22 ప్రభాతవార్త** అన్నిశాఖల సమిష్టి కృషితో శ్రీ పెనుశిల లక్ష్మీనర సింహ స్వామి వారి బ్రహ్మోత్స వాలను విజయవంతం చేయా లని నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి నాగా ఆనూషాకోరారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం కోన లోని కాకతీయ కమ్మ సత్రంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆనుషా మాట్లాడుతూ పెంచలకోన బ్రహ్మోత్సవాలు ఎంతో పవిత్రమైనవని ఈ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరై తారని వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసి వారికి సులభతరంగా దర్శనం అయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు రాష్ట దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలు పలు సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సమస్య లేకుండా చేయడం, పరిసరాలు పరి శుభ్రంగా వుంచడం, ఉత్సవాలలో నిరంతం విద్యుత్ సరఫరా వుండేలా చూడటం, భక్తులకు అవసరమైన వైద్యసేవలు అందించడం, భక్తులు తోపులాట లేకుండా క్యూలైన్ల ఏర్పాటు తదిర విషయాలపై ఆమె శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. దీంతో పాటు ఆదూరుపల్లి నుండి పెంచలకోన వరకు వున్న రోడ్డుకు తాత్కా లిక మరమత్తులు చేపట్టాలని ఆదేశించారు. కోనలో ఇటీవల చిరుతల సంచారం వున్నట్లు సమాచారం వుం దని,అడవి జంతువుల వల్ల భక్తులకు ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూ చించారు. బ్రహ్మోత్సవాలలో 6 రోజులు గోనుపల్లిలోని మద్యం దుకాణాన్ని మూసి వేసి డ్రై డేగా చేయాలని ఆమె ఎక్సైజ్ అధికారులకు సూచించారు. భక్తుల రవాణాకు సంబందించి ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ప్రజా రావాణా సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసి వారికి సూచించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు సంబందించిన వారు శాఖల వారిగా వారు చేపట్టే చర్యలను ఆర్డీఓకు వివరించారు. నేడు జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణా యాలపై మే నెల మొదటి వారంలో మారో మారు సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి,ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, రాపూరు తహశిల్దార్ లక్ష్మీ నరసింహం, యంపీడీఓ మారెళ్ళ భవాని, సిఐ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ మోహన రావు, ఎఇ అంజనేయులు, ఆర్ అండ్ బి ఎఇ మనోహర్, అగ్నిమాపక శాఖాధికారి కుప్పయ్య, అటవీ రెంజ్ అధికారి రవీంద్ర బాబు, వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూర్యధర్మేంద్ర, రాపూరు,రాజంపెట ఆర్టీసి డిపో మేనేజర్‌లు అనీల్ కుమార్. జి.రమణయ్య, బ్రేక్ ఇనస్పెక్టర్ స్వప్నిల్ రెడ్డి,ఎస్ఐ వెంకట రాజేష్, మండల విస్తరణాధికారి బాలకృష్ణా రెడ్డి, విద్యుత్ శాఖ ఎడి సురేష్, ఎఇ శ్రీకాంత్, ఏక్సైజ్ అధికారులు, ఆలయ సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీనారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహ్, పెంచల స్వామి, హర్ష,కొండల రావు, మధు తదితరులున్నారు.

## అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త : కోవూరు నియోజకవర్గంలో జిల్లాలోనే ప్రత్యేకంగా చేపట్టిన అక్షరాస్యత కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా ఐదు మండలాల ఎంపీడీవోలు ప్రత్యేక కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ గుర్తించిన నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా చేయడం అనేది ఒక బాధ్యతగా తీసుకోవాలన్నారు. 90 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా భావించి సమిష్టి కృషితో నూరుశాతం విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆమె ఎంపీడీవోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు శ్రీహరిరెడ్డి, శ్రీహరి, నాగేంద్రకుమార్, సుబ్బారావు, నగేష్‌కుమారిలు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



**కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త** : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మెరుగైన విద్యను అందిస్తున్నారని, ఈ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో బాలాజీ రావు అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి శిక్షణ పొంది ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులకు బోధన అందిస్తున్నారన్నారు. అదేవిధంగా క్రీడా మైదానాలు ఉన్నాయని, ఈ కారణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం కూడా ఉంటుంద న్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ద్వారా విద్యాపరమైన వస్తువులు ఇవ్వడం ద్వారా డొక్కా సీతమ్మ పథకం కింద విద్యార్థులకు మంచి పౌష్టికాహారం కూడా అందిస్తున్నారన్నారు. ఇన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో రహీమ్, ప్రదా నోపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## నూతన సాంకేతిక పద్ధతులను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త** : మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇటువంటి



సబ్సిడీ పథకాలను రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని సమిష్టిగా రైతులతో మమేకం కావాలన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో కోవూరు నియోజకవర్గంలోని రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో వారి ఖాతాలో వేసి వారి కళ్లల్లో ఆనందం నిలపడం జరిగిందన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీతో స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి, వేగూరు సర్పంచ్ అమరావతి, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలు మల్లికార్జునరెడ్డి, బాల రవి, సుధాకర్, బెల్లంకొండ విజయకుమార్, గాదిరాజు అశోక్‌కుమార్, మదన్‌రెడ్డి, పి. మధుసూదన్‌రావు, సాయిరెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నకేశవరెడ్డి, ఎన్. వెంకట్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు, సునీల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లోకేష్, సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి, అల్తాఫ్, పోలిశెట్టి సుబ్బారావు, విజయసాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## సీనియర్ సివిల్‌జడ్జి శోభకు ఘనసత్కారం



**కావలి, ఏప్రిల్22 ప్రభాతవార్త** కావలి సీనియర్ సివిల్‌జడ్జి శోభ కందుకూరుకు బదిలీ అవడంతో ఆమెను మంగళవారం కావలి మాజీ ఎజిపి, టిడిపి లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రముఖ న్యాయవాది పోట్లూరి శ్రీనివాసులు దుశ్శాలువాతో సత్కరించి, పూలమొక్క కుండీని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు సంవత్సరాలు పనిచేసి క్లిష్టమైన అనేక కేసులను పరిష్కరించి అందరి మన్ననలను సీనియర్ సివిల్ జడ్జి శోభ అందుకున్నారని ప్రశంసించారు. అనేక కేసుల్లో మంచి తీర్పులను ఇచ్చారన్నారు. అంతేకాకుండా మండల న్యాయసేవాసంస్థ ఛైర్మన్‌గా ఆమె మంచి సేవలు అందించారన్నారు. ఎంతోమంది పేదప్రజలకు న్యాయసహాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పోట్లూరి వెంట న్యాయవాదులు రాఘవరావు, కొమరి పవన్, జోసఫ్, అలేఖ్య, మసుధ, సిబ్బంది విజయ్‌కుమార్, ప్రసాద్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు వచ్చే పిల్లల పై ప్రత్యేక దృష్టి



**నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** అంగన్వాడీలలో పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సక్రమంగా అందించి పిల్లల ఎదుగుదలకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్వైజర్లులతో అంగన్వాడిలో అమలవుతున్న అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అంగన్వాడీలకు వచ్చే పిల్లలకు ఎదుగుదల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతినెలా ప్రతి కేంద్రంలోపిల్లల ఎత్తు బరువు సక్రమంగా చూసి రికార్డులలో నమోదు చేయాలన్నారు.ప్రత్యేకంగా బరువు తక్కువగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, సూపర్వైజర్లు, సిడిపిఓలు తరచుగా తనిఖీలు చేయాలని, డేటా నమోదు సక్రమంగా జరుగుతుందో లేదో పరిశీలించాలని సూచించారు. .పిల్లలకిచ్చిన ప్లేయింగ్ కిట్స్ సక్రమంగా వినియోగపడుతున్నది లేనిది ఆరా తీశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఎస్టీ, ఎస్సీ ఆవాసాల్లో అవగాహన కల్పించాలన్నారు. 18 సంవత్సరాలలోపు వివాహం జరిగి గర్భం దాలిస్తే వచ్చే అవరోధాలను వివరించాలన్నారు. ఖాళీగా ఉన్న అంగన్వాడి వర్కర్లు త్వరగా భర్తీ చేయాలన్నారు. అంగన్వాడీలలో టాయిలెట్స్ ,తాగునీటి వనరులు , వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ డ్వామా, ఆర్డబ్ల్యూయస్ అధికారుల సమన్వయంతో త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు ఈ సమావేశంలో పి డి ఐ సి డి ఎస్ సువర్ణ, ఏపీడీలు, సిడిపిఓలు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



**కందుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** ప్రజా సమస్యల పట్ల విధి నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బంది అధికారులపై కఠిన చర్యలు తప్పవని శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని మాచవరం సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పని చేసే సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని, ప్రజా సంక్షేమమే పరమావధిగా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా ఉద్యోగులు పని చేయాలని, సమయపాలన విధిగా పాటించాలని ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు మెరువైన వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నజ్యోతి, సచివాలయ, ఆరోగ్య కేంద్రం వైద్యం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సమిష్టి కృషి అవసరం




**కోవూరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కోవూరు నియోజకవర్గ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ మొబిలైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యత శాతం పెంచే కృషిలో భాగంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేపడుతున్నామన్నారు. ఇందుకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని కోవూరు నియోజకవర్గాన్ని ఎంపిక చేయాలని చొరవ చూపారన్నారు. మొత్తం నియోజకవర్గంలో 22000 మంది నిరక్షరాస్యులను గుర్తించారన్నారు. వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కాకుండా వారిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల్లో మస్టర్ వేసే విధానం, బ్యాంకింగ్ కార్యకలాపాలు, తదితర ప్రభుత్వ కార్యక్రమాలపై వారిలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం నియోజకవర్గంలో ప్రత్యేకంగా 2500 మంది స్వచ్ఛంద ఉపాధ్యాయులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. కోవూరు నియోజకవర్గం సంపూర్ణ అక్షరాస్యత సాధించి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాలకు ఆదర్శం కావాలన్నారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా భావించకుండా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గుర్తించిన నిరక్షరాస్యులకు వారి వారి రోజువారి పనులకు ఆటంకం కలగకుండా వారికి అనువైన సమయంలోనే అక్షరాలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం కమ్యూనిటీ మొబిలైజర్లు తమవంతు కృషి చేసి నిరక్షరాస్యులు ప్రతి రోజూ హాజరయ్యే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఆయా గ్రామస్తులు మొబిలైజర్ల మాట వింటారనే నమ్మకంతోనే సమాజంలో వారికి ఉన్న విలువతో గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యంగా బాగా పనిచేసిన 10 నుంచి 15 మంది మొబిలైజర్లను జిల్లా స్థాయిలో గుర్తించి ఆగస్టు 15 వేడుకల్లో వారిని సత్కరించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు మండల స్థాయిలో కూడా వారికి గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి ఆధునిక యుగంలో నిరక్షరాస్యత ఉండడం సమాజానికి మంచిది కాదన్నారు. ఈ 90 రోజుల ప్రణాళికలో భాగంగా అక్షరాలు నేర్పించడమే కాకుండా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో మెళుకువలు అందిస్తారన్నారు. అక్షరాస్యత కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో జరిగే విధానం గురించి ప్రతి నెల కమ్యూనిటీ మొబిలైజర్లతో సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ అజాద్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జెడ్పీ సీఈవో విద్యారమ, డీఈవో బాలాజీరావు, డ్వామా పీడీ గంగా భవాని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, ఐదు మండలాలకు సంబంధించిన ఎంపీడీవోలు, ఏపీఎంలు, ఎంఈవోలు, తదితరులు ఉన్నారు.

## హత్య కేసులో ముద్దాయిల అరెస్టు




**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పెన్నా పరివాహక ప్రాంతంలో ఈనెల 16వ తేదీ రాత్రి జరిగిన సుల్తాన్ హత్య కేసులో ముద్దాయిలు ఇద్దరిని నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సంఘటన సంబంధించిన వివరాలను బుధవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నగర డిఎస్పి సింధుప్రియ వెల్లడించారు. ఆమె తెలిపిన సమాచారం మేరకు.. స్థానిక జాకీర్ హుస్సేన్ నగర్‌లో నివసించే మృతుడు సుల్తాన్ గతంలో పలు కేసుల్లో నిందితుగా ఉంటూ జైలు జీవితం గడిపి వచ్చాడు. స్థానికంగా ఉండే వారిని బెదిరిస్తూ మద్యం కోసం డబ్బులు అడుగుతుండేవాడు. ఈ క్రమంలోనే స్నేహితులైన జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ సలీం అలియాస్ కలీం, సింహపురి కాలనీకి చెందిన యనమల నాగరాజులను కూడా పలు సందర్భాల్లో సుల్తాన్ బెదిరించాడు. దీంతో సుల్తాన్ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న ఇద్దరు అవకాశం కోసం ఎదురు చూశారు. ఈ క్రమంలో 16వ తేదీ తిన్నా ఒడ్డున మద్యం తాగుతున్న సలీం, నాగరాజుల వద్దకు సుల్తాన్ వెళ్ళాడు. వారిని మద్యం కోసం డబ్బులు ఇమ్మని, ఉంటే అంతు చూస్తానని బెదిరించాడు. దీంతో అప్పటికే అతనిపై కోపంతో ఉన్న ముద్దాయిలిద్దరూ కర్రతో బలంగా దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన సుల్తాన్ అక్కడికక్కడే మరణించాడు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవాబుపేట ఇన్చార్జి సీఐ సాంబశివరావు మన సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నిందితులిద్దరిని అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు. ఈ కేసులో ప్రాథమిక దర్యాప్తు చేపట్టిన అప్పటి సీఐ షేక్ అన్వర్ భాష, ప్రస్తుత ఇన్చార్జి సిఐ సాంబశివరావు, ఎస్సైలు రెహమాన్, కే శివయ్య ఇతర సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

## భగత్ సింగ్ కాలనీలో కార్డెన్ సెర్చ్

### - సరైన పత్రాలు లేని 60 వాహనాలు స్వాధీనం





**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త :** జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా, నెల్లూరు టౌన్ పరిధిలోని టిడ్కో హౌసెస్‌లో మంగళవారం ఉదయం పోలీస్ అధికారులు సిబ్బంది కలిసి కార్డన్ సర్చ్ ఆపరేషన్ చేపట్టారు. జిల్లా యస్.పి. కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు, టౌన్ డిఎస్పి సింధు ప్రియ ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు, నలుగురు ఎస్ఐలు, సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిపి సుమారు 90 మందితో సుమారు 100 ఏళ్లకు పైగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 54 బైకులు, 4 ఆటోలు, 2 కార్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు వేలిముద్రల సేకరణ ద్వారా నలుగురు పాత నేరస్థులు గుర్తించారు. నేరనియంత్రణ,అసాంఘిక కార్యక్రమాల అడ్డుకట్టకి పోలీసు శాఖ నిర్వహించే కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమానికి ప్రజలు వంతు సహకారాన్ని అందించాలని డి.ఎస్.పి కోరారు. అసాంఘీకకార్యకలాపాలపై, చట్టాన్ని అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ శోధన ముఖ్య ఉద్దేశ్యం పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవ దమని డీఎస్పీ స్పష్టం చేశారు. వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహ నాలు, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటివి గుర్తించి స్వాధీన పరుచుకున్నారు. భగత్ సింగ్ కాలనీలోని టిడ్కో హౌసెస్ ప్రతి ఇంటిని క్షుణ్ణంగా శోధించారు. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100 కు తెలియజేయాలని కోరారు.

## రేషన్ పంపిణీలో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు - తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త** :ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న రేషన్ సరుకులను పక్కదారి పట్టించినట్లయితే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో మండలంలో పనిచేస్తున్న డీలర్ల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ సకాలంలో ప్రజలకు రేషన్ సరుకులు అందజేయాలని సూచించారు. డీలర్లు ఎవరైనా పేద ప్రజలకు అందించే రేషన్ పంపిణీకి అవినీతికి పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని డీలర్లకు హెచ్చరించారు. అలాగే డీలర్లు మాట్లాడుతూ పూర్తి సమాచారం రేషన్ పంపిణీ చేసే వాళ్ళు అందించడం లేదని తెలియజేశారు. తహసిల్దార్ స్పందించి సంబంధిత రేషన్ సరుకులు పంపిణీ చేసే వాళ్లకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ బాలకోటమ్మ, ఆర్ ఐ సునీల్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.